# సలోమి

ఉదయం తొమ్మిదంటే తొమ్మిదింటికి కాదు గాని పది, పదిహేను నిమిషాలు అటుగానో, ఇటుగానో నా షాపు తెరుస్తూ ఉంటాను. నాది పెద్ద షాపేం కాదు. అలా అని మరీ చిన్న షాపేం కాదు. పెయింటింగ్ షాపు, ఫ్లెక్సీలు, బోర్డులు తయారు చేస్తుంటాను. పెయింటు వాసనతో గది నిండిపోయి ఉంటుంది. ఎప్పటి పనులు అట్టే సమయం తీసుకోకుండా ముగించి ఇచ్చేస్తుంటాను. అంచేత షాపు ఎప్పటి కప్పుడు ఖాళీగా ఉన్నట్టనిపిస్తుంటుంది. రెండు గదులు.

నాకు సహాయం చేసేందుకు ఒక

కుర్రాడిని పెట్టుకున్నాను. చాకులాటివాడు ఫలానా పని చేయమని వాడికి ఒకటికి రెండుసార్లు చెప్పాల్సిన అవసరం లేదు. నేను చెప్పిన పని గురించి అడిగేలోపల 'చేశాను సార్' అంటాడు. మంచిగా పని చేసేవాళ్ళను ఎక్కువ జీతం ఎరవేసి లాక్కెళ్ళడం మామూలుగా జరిగేపని. ఎందుకో ఈ కుర్రాడు నన్ను వదల్లేదు. నాలుగేళ్ళుగా నన్ను అంటిపెట్టుకునే ఉన్నాడు. తన పనులేవో తాను చకచకా చేసుకు వెళ్ళిపోతుంటాడు. అవసరమయితే తప్ప నాతో కూడా ఎక్కువ మాట్లాడడు.

ఉదయం కన్నా మధ్యాహ్నం దాటాక ఆర్డర్స్ రావడం మొదలవుతుంటాయి. చుట్టుప్రక్కల మరో షాపు లేకపోవడం వలన పని వత్తిడి ఎక్కువగానే ఉంటుంది. కొన్నిసార్లు రాత్రి పది దాటేవరకు కూర్చోవలసి వస్తుంటుంది. వాళ్ళ వాళ్ళకెవరికో బాలేదని పని కుర్రాడు రెండు రోజులుగా రావడం లేదు.

ఆ వేళ షాపు తెరిచేసరికి పది దాటింది. నేను చేతికి గడియారం పెట్టుకోను. షాపులో గోడ గడియారం ఉంది. రెండు నెలలుగా పనిచేయడం లేదు. మరమ్మత్తు చేయించాలి అని ఉన్నా కుదరడం లేదు.

షాపు గోడకు స్కూటరు పార్కుచేసి, షట్టరు తాళాలు తీసి, షట్టరు పైకి నెట్టి లోపలికి నడుస్తూ ఆగాను. నా షాపుకు దాదాపు ముందుగా ఒకమ్మాయి దీన ముఖంతో చేతులు కట్టుకొని నిలబడి ఉంది. ఆ అమ్మాయికి పదీ పన్నెండు ఏళ్ళు ఉండొచ్చు. ఎర్రగా, సన్నగా ఉంది. జుట్టు పైపైన దువ్వుకున్నట్లు ఉంది. బూడిద రంగు ఫ్రాకు కొత్తగా లేదు. ఒక చేతిలో డబ్బులు దాచుకునే పోస్టాఫీసు డబ్బా ఉంది. మరో చేయి మడిచి ఉంది. చదువుకునే అమ్మాయిలానే ఉంది. అప్పుడప్పుడు చందాల కోసం పిల్లలు స్కూళ్ళ తరఫున వస్తుంటారు. ముందు అలా అనుకున్నాను. పరీక్షగా పాపను చూస్తే అలా అనిపించలేదు. ముఖంలో విచారం గడ్డకట్టి ఉంది. కళ్ళు ఉబ్బి ఎర్రగా ఉన్నాయి.

నా వెనకే షాపులోకి వచ్చి "చాలాసేపటి నుండి మీకోసం ఎదురుచూస్తూ ఉన్నాను" మాటల్లో దుఃఖం ఉంది.

ఆ పాపను నా ఎదురుగా ఉన్న ప్లాస్టిక్ కుర్చీలో కూర్చోమన్నాను. కూర్చున్నాక, "ఎందుకు?" అడిగాను.

"నాకో సహాయం చేసిపెట్టాలి"

"చెప్పమ్మా" అన్నాను.

షాపంతా మురికిగా ఉంది. నా అసిస్టెంటు ఉండి ఉంటే ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేవాడు. నేను చేసుకోవడం కుదరడం లేదు. మునుపటంత శక్తి ఉండటం లేదు. పట్టుమని మూడు గంటలపాటు కూర్చోలేకపోతున్నాను.

తను చెప్పాలనుకుంటున్న విషయం ఎలా మొదలుపెట్టాలో అర్థం అవుతున్నట్లు లేదు. ప్యాకెట్‌లోంచి సిగరెట్టు తీసి వెలిగించాను. ఇంట్లో నేను సిగరెట్ తాగడం నా భార్యాపిల్లలకు ఇష్టం ఉండదు. తాగనీయరు. బయటకు వచ్చి తాగుతుంటాను. షాపులో ఏ అడ్డంకి ఉండదు. షాపులోకి వచ్చిన దగ్గరనుండి సాయంత్రం వరకు ప్యాకెట్టు సిగరెట్లు తాగుతాను. చేతిలో సిగరెట్ లేకపోతే కొత్త ఆలోచనలు రావు. పాపకు ఎదురుగా ఉన్న స్టూలు మీద కూర్చుంటూ "నీ పేరు?" అడిగాను.

"నా పేరు సలోమి, అయిదో తరగతి చదువుతున్నాను. నాన్న పేరు రవి... రవివర్మ. ప్రైవేటు కంపెనీలో ఏ.సి.ల పనులేవో చూస్తుండేవారు. ఆయన ఆఫీసు ఎక్కడో నాకు తెలియదు. నేనొక్కదాన్నే కూతుర్ని..." అంటోంటే గొంతులో మార్పు వచ్చింది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. కుడిచేయి కదుపుతోంది కాని ఎలా చెప్పాలో అర్థం కావడం లేదనుకుంటాను.

పాప ఏం చెప్పబోతోందో నేను ఊహించలేకపోతున్నాను. అరనిమిషం ఆగి కళ్ళు తుడుచుకుని మెల్లగా తనను తాను కూడగట్టుకుంటూ, "ఒక ఫ్లెక్సీలో నాలుగంటే నాలుగు మాటలు రాయడానికి ఎంత అవుతుంది?" అడిగింది.

"ఫ్లెక్సీ ఎంతుండాలి?"

"మామూలు క్లాసు బ్లాక్‌బోర్డులో సగం లేదా మూడోవంతయినా చాలు."

"కనీసం అయిదు వందలు ఉంటుంది. ఫోటో కూడా వేయాలా?"

"ఊ... అంతకు తక్కువకు రాదా?" సలోమికి కొద్దికొద్దిగా ధైర్యం ఏర్పడుతున్నట్లుంది.

సామాన్యంగా ఈ విషయాలు పెద్దవాళ్ళు వచ్చి మాట్లాడతారు. చిన్నపాప రావడం అదే మొదటిసారి. పెద్దాళ్ళయితే వీలు కాదనో, తక్కువంటే నాకు పడదనో చెప్పొచ్చు.

"మీ ఇంట్లోని పెద్దవాళ్ళు ఎవరయినా వస్తే బావుండేది..." విసుగ్గా అనలేదు. మామూలుగా అన్నాను.

"ఎవరూ లేరు. మా అమ్మ అవిటిది. తన చిన్నప్పుడు పోలియో వచ్చింది. కష్టం మీద వాకర్‌తో నడుస్తుంది. అయినా ఇంట్లో ఖాళీగా ఏమీ కూర్చోదు. కష్టపడుతూ ఉంటుంది. కుట్టుమిషను పెట్టుకుని చుట్టు ప్రక్కల ఇళ్ళవాళ్ళకు ఏవయినా కుట్టిపెడుతూ ఉంటుంది... డబ్బులకే అనుకోండి..." అని సలోమి దుఃఖం ఆపుకోలేకపోయింది. "... ఇవేళ్టితో మా నాన్న చనిపోయి మూడో రోజు... డబ్బులు లేక మా నాన్న ఫోటో పేపర్లలో వేయలేదు. నాన్న స్నేహితులు మా దగ్గర బంధువులు బాగానే సహాయం చేశారు. ప్రతిదీ వాళ్ళనే కాదు, ఎవరినీ అడగడం ఏం బావుంటుంది? ఈ డబ్బాలో అప్పుడప్పుడు నాన్న, అమ్మ ఇచ్చిన చిల్లర డబ్బులు దాచుకున్నాను... ఎంతుంటుందో నేను లెక్కపెట్టలేదు... మీరు అడిగినంత ఉండదు... మేం ఉన్న వాళ్ళమేమీ కాదు..." వెక్కివెక్కి ఏడుస్తూనే చెపుతోంది.

దుఃఖాన్ని ఆపుకోవడం నాకు వీలు కాలేదు. సిగరెట్టు తాగబుద్ధి కాలేదు. గది మూలకు విసిరేశాను. "మీ నాన్న ఎలా చనిపోయారు?" అడిగాను. నా కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి.

"ఉదయం నాన్న ఆఫీసుకు వెళ్తూ నన్ను తన స్కూటరు మీదే తీసుకు వెళ్తుంటారు. మొన్న ఈ వీధి చివరి మలుపులోనే... నాన్నదేం తప్పులేదు... ఆర్టీసి బస్సు వేగంగా వచ్చి నాన్న స్కూటరును వెనుకనుండి గుద్దింది. వెనుక కూర్చున్న నేను గోడ పక్కకు పడ్డాను. నాన్న, స్కూటరు బస్సు క్రింద పడ్డా, నాకు దెబ్బలేం తగల్లేదు. ఆర్టీసి బస్సు డ్రైవర్ బస్సును ముందుకు తీసుకువెళ్ళి ఆపి ఎవరయినా పట్టుకుని తంతారేమోనని భయంచేత బస్సు దూకి పారిపోయాడు. నాన్నకు దెబ్బలు బాగా తగిలాయి. ఒళ్ళంతా రక్తం. నాన్న దగ్గరకు వచ్చి ప్రక్కనే కూర్చున్నాను. ఒక్కొక్కళ్ళే చేరుతున్నారు. నేను పెద్దగా ఏడుస్తోంటే, నాన్న నా తల నిమురుతూ, "నాకేం కాలేదమ్మా, బాగవుతాను. రేయ్ సలోమీ, మీ అమ్మను జాగ్రత్తగా చూసుకోరా... ఏడవకు. నువ్వేడుస్తోంటే నాకు ఏడుపొస్తోంది. అమ్మ పిచ్చిదిరా... అమ్మకు ఇబ్బంది కలిగించకు. మంచిగా చదువుకో... నాన్న నాతో మాట్లాడుతూనే చనిపోయారు..." ఆ పాపను ఎలా ఓదార్చాలో అర్థం కావడం లేదు.

కొద్దిసేపాగి, "ఫ్లెక్సీలో ఏం రాయమంటావు?" అడిగాను.

ఫ్రాకు జేబులోంచి మడతలు పెట్టిన కాయితం తీసి నాకు అందించింది. మధ్యలో సగం కార్డు సైజులో ఉన్న ఫోటో అది. రవివర్మ చామనచాయలో అందంగానే ఉన్నాడు. ఫోటో వెనక పుట్టిన తేది, చనిపోయిన తేది ఉన్నాయి. అతని వయస్సు చనిపోయేనాటికి ముప్పయ్యేడు సంవత్సరాలు. తానిచ్చిన కాయితంలో చిన్న చిన్న అక్షరాలతో ఇలా ఉంది :

"నాన్నా! అమ్మా, నేను బావున్నాం. మీరు దేవుడి దగ్గర క్షేమంగా ఉన్నారని అనుకుంటున్నాం. అమ్మ ఒకటే ఏడుస్తోంది. భోజనం సరిగా చేయడం లేదు. నాన్నా అమ్మను నేనెప్పుడూ తొందరపెట్టను. ప్రామిస్. అమ్మకాలు నయం చేయమని దేవుడికి చెప్పండి. ప్రేమతో మీ సలోమి."

ఆ ఉత్తరం తానే రాసిందో, ఎవరిచేతో రాయించిందో అడగాలనిపించలేదు. ఒకటికి రెండుసార్లు చదివాక నాకు దుఃఖం మరింత ఎక్కువయింది. షాపు వెనకకు వెళ్ళి చిన్నపిల్లాడిలా ఏడ్చేశాను.

పట్టుదలగా కూర్చుని అట్టే సమయం తీసుకోకుండా ఫ్లెక్సీ తయారుచేసి మధ్యాహ్నం రెండు గంటలు దాటాక రవివర్మ ప్రమాదం జరిగిన ప్రదేశంలో దారి పక్కనే ప్రహరీ గోడకు ఆనుకుని రెండు కర్రలు పాతి నిలబెట్టాం. అక్కడి ఇద్దరి ముగ్గురు పిల్లలు కూడా మాకు సహాయం చేశారు. అనుకోకుండా ఫ్లెక్సీ బాగా వచ్చింది.

సలోమి చేసిన మొదటి పని, పని అయిపోగానే ఫ్లెక్సీ ముందు మోకాళ్ళాని కన్నీళ్ళతో చేతులు జోడించి ప్రార్థన చేసుకుని తాను తెచ్చుకున్న కొవ్వొత్తుల్లో తానొకటి వెలిగించి, నాకు ఒకటి ఇచ్చి వెలిగించింది. అంత మంచి పని ఒక ఆత్మ కోసం చేయడం నా జీవితంలో అదే మొదటిసారి. మనసు తేలికయినట్టనిపించింది.

ఆశ్చర్యకరమయిన విషయం ఏమిటంటే అరగంట తర్వాత మా కొవ్వొత్తుల చుట్టూ ఇరవై పై చిలుకు కొవ్వొత్తులు ఎవరెవరో వెలిగించారు. తర్వాత నాకు సలోమి కనిపించలేదు. ఇంటికి వెళ్ళి తన తల్లిని తీసుకురావడానికి వెళ్ళి ఉంటుందేమో అనుకున్నాను. మాటవరుసకన్నా నాతో చెప్పి ఉండాల్సింది. డబ్బుల డబ్బా బల్లమీదే ఉంది. గంటలు గడిచాయి. సాయంత్రం అయిదయింది. మరుసటి రోజు గడిచింది. సలోమి రాలేదు. ఎంతో మంది వచ్చి కొవ్వొత్తులు పెట్టి నివాళులు అర్పిస్తున్నారు.

అప్పుడప్పుడు నలుగురయిదుగురు ఆర్టీసి డ్రైవర్లు అక్కడ బస్సులు ఆపి కొవ్వొత్తులు వెలిగించి మరీ వెళ్తున్నారు.

నాకు ఇప్పటికీ ఆశ్చర్యం, బాధ కలిగించే విషయాలు ఏమిటంటే సలోమి ఇల్లు నాకు ఎంత ప్రయత్నించినా దొరకలేదు. మా చుట్టుపక్కల ఉన్న ప్రతి స్కూల్లో వాకబు చేశాను. ఆ పేరు గల అమ్మాయి లేదని చెప్పారు. ఆ అమ్మాయి పేరు సలోమి కాక మరేదయినా ఉందా? నేను భయపడేది ఒక్కటే. సలోమికి జరగకూడనిది ఏమయినా జరిగిందా? సలోమి నాకు ఎప్పుడూ కనిపించలేదు. డబ్బుల డబ్బా ఇప్పటికీ నా బల్లమీదే ఉంది. ప్రతి ఉదయం నా షాపు షట్టర్ తీసేప్పుడు నా వెనక ఎవరో నుంచున్నట్టు అనిపిస్తుంటుంది. వెనక్కి తిరిగి చూస్తే ఎవరూ కనిపించరు. షాపులోకి వస్తున్నప్పుడు చల్లటి గాలి నామీద ఎవరో కుమ్మరించినట్టుంటుంది.

***విపుల, జనవరి- 2014***